సాక్షి వనపర్తి

శనివారం । 20 । మే । 2023



‘ఎన్‌ఎంఎంఎస్’లో ప్రతిభ

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు.

వివరాలు 8లో ▸



వైభవంగా చండీహోమాలు

జోగుళాంబ ఆలయంలో జరిగిన చండీ హోమంలో 223 మంది భక్తులు పాల్గొన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.1 /27.3

ఉదయం ఆకాశం తేలికపాటి మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

గంబూషియా ఫిష్‌పాండ్ సందర్శన



పెబ్బేరు: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న గంబూషియా ఫిష్‌పాండ్‌ను శుక్రవారం జిల్లా వైద్యాధికారి డా. రవిశంకర్ సందర్శించారు. చేపల పెరుగుదల, వాటికి అందించే ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మదనాపురం, పెద్దమందడి, పెబ్బేరులోనూ ఫిష్‌పాండ్‌లు ఉన్నాయని.. వర్షాకాలంలో నిల్వ నీటిలో దోమల గుడ్లు తినడానికి ఈ చేపలను వదులుతామని వివరించారు. అలాగే డ్రైడే డ్రైడేలో పాల్గొని ఇళ్లలోని సిమెంట్ ట్యాంకులు, పాత టైర్లు, ఎయిర్ కూలర్లు, పూలకుండీలో నీరు నిల్వకుండా చూడాలని వైద్యసిబ్బందికి సూచించారు. స్థానిక వైద్యాధికారి డా. రాకేష్ రెడ్డి, జిల్లా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, లక్ష్మీరెడ్డి, గంధం రాజు, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్‌గౌడ్, ఏఎన్‌ఎం వెంకటమ్మ, ఆశ కార్యకర్తలు చెన్నమ్మ, గోవిందమ్మ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నకిలీపై ఉక్కుపాదం



వనపర్తి: నకిలీ విత్తనాలు, ఎరువుల సరఫరా, విక్రయాలపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీకుమార్ అన్ని జిల్లాల ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని జిల్లాలో నకిలీ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లాలో పోలీసు, వ్యవసాయశాఖ సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారుల సూచనలు పాటిస్తూ వ్యవసాయశాఖ ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి విధిగా రసీదు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. నకిలీని అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని.. ప్రైమరీ కాంటాక్ట్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పోలీసు, వ్యవసాయ అధికారులతో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయించిన 13 మందిని బైండోవర్ చేశామని, మద్యం రవాణాపై ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

వనపర్తిటౌన్: ప్రయాణికుల సమస్యలు, సూచనలు, సలహాలు స్వీకరించేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పరమేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 వరకు సెల్‌ఫోన్ నంబర్ 9959226289కు ఫోన్‌చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం..

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్టీసీ ఆర్‌ఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను సెల్ నం.99592 26295కు తెలియజేయాలని ఆమె కోరారు.

నేడు ఈసెట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా శనివారం ఈసెట్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు జేపీఎన్‌సీ కళాశాలలో 205 మంది, ఫాతిమా విద్యాలయంలో 150 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 పరీక్ష కొనసాగనుంది.

ఎస్సీ స్టడీ సర్కిల్ అర్హత పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఫౌండేషన్ కోర్సులో శిక్షణకు దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు నిర్వహిస్తామని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు బాల్‌పెన్, హాల్‌టికెట్‌తో హాజరుకావాలని ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ నం.98859 29862కు ఫోన్ చేయాలని సూచించారు.

రూ.2వేల నోట్ల రద్దుపై విభిన్న స్పందన

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రూ.2 వేల నోట్లను వెనక్కి తీసుకోవాలని కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 30 వరకు బ్యాంకులు, ఆర్‌బీఐ కార్యాలయాల్లో మార్చుకోవచ్చని సూచించింది. అయితే 2016, నవంబర్ 8న రూ.వెయ్యి, రూ.500 నోట్లను రద్దు చేయడంతో అప్పట్లో ప్రజానీకం చాలా అవస్థలు పడ్డారు. ఈ నోట్లను తీసుకోవడానికి పాల దుకాణాలతో పాటు హోటళ్లు, కిరాణా షాపుల్లోనూ నిరాకరించారు. అప్పట్లో పాత పెద్ద నోట్ల స్థానంలో రూ.2వేలు, రూ.500 కొత్త నోట్లను తెచ్చిన ఆర్‌బీఐ ఇప్పుడు రూ.2వేల నోట్లు వెనక్కి తీసుకోవాలని నిర్ణయించడంపై ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నోట్లు మార్చుకునే గడువు మరికొంత కాలం పెంచాలని, ఆర్థిక వ్యవస్థ, రియల్ ఎస్టేట్ రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నోట్ల రద్దుతో ఒరిగిందేమీ లేదు..



గతంలో నోట్ల రద్దుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం తప్పా ఒరిగిందేమీ లేదు. ముద్రణ ఖర్చు భారమంతా ప్రజలపై పడింది. ప్రస్తుతం రూ.రెండు వేల నోట్ల రద్దు కూడా అంతే.

– కృష్ణయ్య యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు, మదనాపురం

- పెద్దగా ప్రభావం ఉండదంటున్న పేద, మధ్యతరగతి వర్గాలు
- మార్పిడిలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాపారుల ఆందోళన
- ఆర్థిక వ్యవస్థ, రియల్ ఎస్టేట్‌కు ప్రతికూలం అంటున్న నిపుణులు

హర్షదాయకం..



రూ.2 వేల నోట్ల రద్దుకు ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం హర్షదాయం. 2016లో నోట్ల రద్దు సమయంలోనే రూ.2 వేల నోట్లను ముద్రించవద్దని ప్రజలందరూ ఖండించినా కేంద్రం పట్టించుకోలేదు. ఇప్పుడు రూ.2 వేల నోట్లను రద్దు చేయడంలో మతలబు ఏమిటి. దీనిపై ప్రజలకు కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. రూ.2 వేల నోట్ల మార్పిడి గడువు పెంచాలి.

– షేక్ ఫారుఖ్ హుస్సేన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మహబూబ్‌నగర్

ప్రతికూల ప్రభావం



ఈ పరిణామం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పెట్టుబడిదారుల వద్ద ఉన్న నోట్లు మార్చుకునేందుకు ఇబ్బందులు, పెట్టుబడి తగ్గి, ఉత్పత్తి తగ్గుతుంది, నిరుద్యోగంపై కూడా ప్రత్యక్షంగా కొన్ని రంగాలపై చూపించవచ్చు. అభివృద్ధి వృద్ధి వెనకబడే ప్రమాదం ఉంది. ఒక కోణంలో ఇది స్వార్థపూరితమైన నిర్ణయమే. ఎన్నికల కోణంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. అపోజిషన్ పార్టీలకు ఇది ఇబ్బందికరంగా ఉంటుంది.

– గడ్డం జీమ్మీకార్టన్, మాజీ హెచ్‌ఓడీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్, పీయూ

రద్దు చేయడం ఏమిటి..



రూ.2 వేల నోట్లను అకస్మాత్తుగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం అంతుపట్టని విషయం. మార్కెట్లోకి ఎందుకు తెచ్చారు.. ఎందుకు రద్దు చేశారు. దాని ఖర్చు భారం ప్రజలపైనే పడుతుంది కదా. ఈ విషయం కేంద్రానికి తెలియదా. పరోక్షంగా పేదలపై భారం మోపడమే.

– జగదీశ్, మదనాపురం

నిర్ణయం మంచిదే...



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సమర్థించదగ్గ విషయం. దీని వల్ల నల్లధనం బయటికి వస్తుంది. ఉద్యోగులకు ఎలాంటి నష్టం లేదు. అలాగే పేదలకు కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. పేదలకు పెద్ద నోట్లు పెట్టుకునే స్థోమత కూడా లేదు. ఒకవేళ ఉన్న దాదాపు నాలుగు నెలల కాలంలో సులభంగా మార్చుకోవచ్చు.

– కృష్ణుడు, బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

పారదర్శకంగా ఓటరు జాబితా

కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి శాశ్వతంగా వెళ్లిన వారు, రెండు చోట్ల ఓటు ఉన్న వారు, మరణించిన వారి ఓట్లను క్షేత్రస్థాయిలో విచారణ చేసి తొలగించి పారదర్శక ఓటరు జాబితాను రూపొందించామని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. శుక్రవారం మధ్యాహ్నం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై, 2023 ప్రామాణిక తేదీతో వచ్చే ఓటరు నమోదు దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు ఓటరు ఎపిక్ కార్డు అందజేస్తామన్నారు. తొలగించిన ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల మార్పు చేర్పులు ఇతరాత్ర వాటిపై సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. జనవరి 5, 2022 నుంచి జనవరి 5, 2023 వరకు 11,190 మందిని ఓటరు జాబితా నుంచి తొలగించినట్లు వివరించారు. ఒకే ఇంటినంబరుతో 6 అంతకన్నా ఎక్కువ ఓటర్లు నమోదైన ఇళ్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తామన్నారు. జూన్ 1 నుంచి 20వ తేదీ వరకు ఈవీఎం, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్ల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మొక్కలకు నీరుపోసిన కలెక్టర్..

శుక్రవారం వాటర్‌డేను పురస్కరించుకొని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సమీకృత కలెక్టరేట్ ఆవరణలోని మొక్కలకు నీరుపోశారు. హరితహారంలో పట్టణాలు, పల్లెల్లో నాటిన మొక్కలకు ప్రతి శుక్రవారం నీరందించి కాపాడుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి..

వనపర్తిలో నెలకొన్న తాగునీటి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గుంపుగట్టు బైపాస్ ద్వారా రోజుకు 6 ఎంఎల్‌డీల తాగునీరు పట్టణానికి వచ్చేలా చూడాలన్నారు. పంపింగ్‌కు విద్యుత్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు.

జిల్లా క్రీడలను ఘనంగా నిర్వహించాలి..

జిల్లాకేంద్రంలో ఈ నెల 22 నుంచి నిర్వహించే సీఎం కప్ క్రీడలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల పాటు స్థానిక డా. బాలకిష్టయ్య క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించాలన్నారు. పోటీల నిర్వహణ ఇన్‌చార్జులుగా జిల్లా అటవీ అధికారి నవీన్‌రెడ్డి, డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డిని నియమించామని తెలిపారు. క్రీడాకారులకు కనీస సౌకర్యాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించాలన్నారు. టెంట్లు, డయాస్, మైక్‌సిస్టం ఏర్పాటు చేయాలని పుర కమిషనర్‌ను ఆదేశించారు. నిర్వహణకు స్టేజ్ కమిటీ, గ్రౌండ్ కమిటీ, వాటర్ కమిటీ, ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓలు, ఎంఈఓలు ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలకు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. ఆదివారం సాయంత్రంలోపు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి నవీన్‌రెడ్డి, డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, డీఈఓ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. అలాగే వేసవి శిక్షణ క్రీడాకారులను పరిచయం చేసుకోవడంతో పాటు క్రీడాకారులతో హాకీ, వాలీబాల్, ఫుట్‌బాల్ ఆడారు.

పాలమూరు టు వైజాగ్

- ఇక నుంచి రోజువారీగా ప్రయాణించనున్న ఎక్స్‌ప్రెస్
- ఇప్పటికే జిల్లా మీదుగా నడుస్తున్న వారాంతపు రైలు
- ఎట్టకేలకు నెరవేరబోతున్న జిల్లావాసుల ఆకాంక్ష
- పలు పర్యాటక ప్రాంతాలను చూసే అవకాశం
- నేడు ప్రారంభించనున్న కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా నుంచి విశాఖపట్నం వెళ్లాలనుకునే రైల్వే ప్రయాణికులకు వెసులుబాటు లభించింది. రోజువారీ మహబూబ్‌నగర్– విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ (విశాఖపట్నం– కాచిగూడ– మహబూబ్‌నగర్) జిల్లా ప్రయాణికుల ముంగిట వచ్చింది. ఇప్పటికే జిల్లా మీదుగా విశాఖపట్నం– మహబూబ్‌నగర్ వారాంతపు రైలు నడుస్తోంది. (08585) విశాఖపట్నం– మహబూబ్‌నగర్ రైలు ప్రతి మంగళవారం రాత్రి 7 గంటలకు విశాఖనుంచి బయలుదేరి బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుంది. తిరిగి (08586) మహబూబ్‌నగర్– విశాఖపట్నం రైలు ప్రతి బుధవారం సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. అయితే మహబూబ్‌నగర్– విశాఖపట్నం రైలును వారాంతపు కాకుండా రోజువారీగా నడపాలన్న జిల్లా రైల్వే ప్రయాణికుల ఇప్పుడు కోరిక నెరవేరింది.

పలు పర్యాటక ప్రాంతాలు..

రోజువారీగా మహబూబ్‌నగర్– విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలుతో ఉమ్మడి జిల్లాలోని పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. విశాఖపట్నంతో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాలను చూసే అవకాశం జిల్లా రైల్వే ప్రయాణికులకు లభిస్తుంది. ఒకరోజు ఈ పర్యాటక ప్రాంతాలను చూసి తిరిగి ఇదే రైలులో జిల్లాకు చేరుకోవచ్చు. దీంతో జిల్లా నుంచి విశాఖపట్నంకు వెళ్లేవారికి వెసులుబాటు లభిస్తుంది.

సంతోషంగా ఉంది..



విశాఖపట్నం– కాచిగూడ రోజువారీ రైలును మహబూబ్‌నగర్ వరకు పొడిగించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే జిల్లా మీదుగా తిరుగుతున్న వారాంతపు రైలును ప్రతిరోజు నడపాలని గతంలో రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పుడు మహబూబ్‌నగర్– విశాఖపట్నం రైలును ప్రారంభిస్తున్నందుకు రైల్వేశాఖకు ధన్యవాదాలు. ఈ రైలు వల్ల ఉమ్మడి జిల్లా ప్రయాణికులు అరకులోయ, అన్నవరం తదితర పర్యాటక ప్రాంతాలను చూసే అవకాశం లభిస్తుంది.

– గోపాల్ నారాయణ, డీఆర్‌యూసీసీ మెంబర్



మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్

ఏర్పాట్లు పూర్తి..

విశాఖపట్నం నుంచి కాచిగూడ వరకు నడుస్తున్న రోజువారీ ఎక్స్‌ప్రెస్ రైలును మహబూబ్‌నగర్ వరకు పొడిగించారు. ఈ రైలును శనివారం జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో మధ్యాహ్నం కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ మేరకు రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక వేదిక, ఇతర ఏర్పాట్లు చేశారు. మహబూబ్‌నగర్ నుంచి కోస్తా ఆంధ్ర ప్రాంతానికి నేరుగా కనెక్టివిటీ లేదు. ఈ సమస్యను తీర్చడానికి రైల్వే మంత్రిత్వ శాఖ విశాఖపట్నం– కాచిగూడ– విశాఖపట్నం (12861/12862) ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 20 నుంచి మహబూబ్‌నగర్ వరకు పొడిగించింది. ఈ రైలు ప్రతి రోజు విశాఖపట్నంలో సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరి దువ్వాడ, అనకాపల్లి, తుని, అన్నవరం, సామర్లకోట జంక్షన్, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, రాయనపాడు (విజయవాడ), ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట జంక్షన్, మల్కాజ్ గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల మీదుగా మహబూబ్‌నగర్‌కు ఉదయం 9.20 గంటలకు చేరుకుంటుంది. మహబూబ్‌నగర్ నుంచి ప్రతిరోజు ఇదే రైలు సాయంత్రం 4.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు విశాఖపట్నంకు చేరుకుంటుంది. ఈ రైలు జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్‌లలో స్టాప్‌లను కలిగి ఉంది. ఈ రైలులో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేయడం వల్ల, ఇవి ఆధునిక సౌకర్యాలతో సౌకర్యవంతమైన ప్రయాణం చేయవచ్చు. కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ఇతర ప్రజాప్రతినిధులు, సీనియర్ రైల్వే అధికారులు పాల్గొనున్నారు.


నేడు కిషన్‌రెడ్డి రాక

పాలమూరు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వస్తున్న నేపథ్యంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు వీరబ్రహ్మచారి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లు పరిశీలించారు. బీజేపీ నేతలు రైల్వే అధికారులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభం చేయనున్న మహబూబ్‌నగర్– విశాఖపట్నం రైలు ఏర్పాట్లపై ఆరా తీశారు. మొదట కేంద్ర మంత్రి బీజేపీ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్నం ఒంటిగంటకు విలేకరుల సమావేశం నిర్వహించి ఆ తర్వాత రైలు ప్రారంభం చేయనున్నట్లు వీరబ్రహ్మచారి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యం, పాండు రంగారెడ్డి, సుబ్రహ్మణ్యం, అంజయ్య, నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రెండు దశలుగా ఎత్తిపోతలు..

- ఉమామహేశ్వర, చెన్నకేశవ ప్రాజెక్టులపై కొనసాగుతున్న కసరత్తు
- మొదటి దశ పనులకు రూ.1,534.50 కోట్లతో అనుమతులు
- రెండోదశలో పనులకు మరో రూ.687.50 కోట్ల ప్రతిపాదనలు
- వచ్చే నెలలో శంకుస్థాపనకు అవకాశం



ఉమామహేశ్వర, చెన్నకేశవ రిజర్వాయర్ల ప్రతిపాదిత మ్యాప్

సాక్షి, నాగర్‌కర్నూల్: అచ్చంపేట ఎత్తిపోతల పథకం కింద రెండు దశల్లో లిఫ్ట్ పనులను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా మొదటి దశలో ఉమామహేశ్వర ఎత్తిపోతల పథకానికి రూ.1,534.50 కోట్లతో నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పనులకు సంబంధించిన టెండర్లను సైతం 15 రోజుల్లోగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అలాగే రెండో దశలో చేపట్టనున్న చెన్నకేశవ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి మరో రూ.687.50కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. వీటికి నిర్మాణాలకు వచ్చే నెలలో శంకుస్థాపన చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

ఇప్పటికే మొదటిదశకు గ్రీన్‌సిగ్నల్

మొదటి దశలో చేపట్టనున్న ఉమామహేశ్వర ఎత్తిపోతల పథకంలో భాగంగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులోని ఏదుల రిజర్వాయర్ నుంచి ఉమామహేశ్వర రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోయనున్నారు. ఇందుకోసం బల్మూర్ మండలం కొండనాగుల, బల్మూర్, అంబగిరి గ్రామాల మధ్య 2.67టీఎంసీల సామర్థ్యంలో ఉమామహేశ్వర రిజర్వాయర్‌ను నిర్మిస్తారు. ఈ రిజర్వాయర్ కిందే అప్రోచ్ కెనాల్‌తో పాటు రాంపూర్, రంగాపూర్ వద్ద మరో రెండు మెయిన్ కాల్వలను నిర్మించనున్నారు. వీటికి బ్రహ్మణపల్లి, పెనిమిళ్ల మినీ కాల్వలను ఏర్పాటుచేసి ఐదు మండలాల పరిధిలోని 61 గ్రామాల్లో సుమారు 57,200 ఎకరాలకు నీరందించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1,534.50 కోట్లతో పరిపాలన అనుమతులను జారీ చేసింది.

మలిదశలో 15వేల ఎకరాలకు నీరు..

రెండో దశలో చెన్నకేశవ ఎత్తిపోతల పథకం ద్వారా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్, పదర మండలాల్లోని ఏడు గ్రామాలకు సాగునీరందించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం రూ.686కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. రెండోదశలో అచ్చంపేట మండలంలోని రంగాపూర్ మెయిన్ కెనాల్ నుంచి నీటిని మన్ననూరు సమీపంలో ఏర్పాటు చేయనున్న మద్దిమడుగు ఆంజనేయస్వామి రిజర్వాయర్‌కు తరలించనున్నారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం 0.509 టీఎంసీ సామర్థ్యం కాగా, రిజర్వాయర్ నిర్మాణం కోసం సుమారు 101 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఇందులో 80 ఎకరాల మేర ఫారెస్ట్ భూమి కాగా, మిగిలిన 21 ఎకరాలు రైతుల నుంచి సేకరించాల్సి ఉంటుంది. ఆంజనేయస్వామి రిజర్వాయర్ నుంచి చెన్నకేశవ కెనాల్, లక్ష్మాపూర్ కెనాల్ నిర్మాణాలను చేపట్టనున్నారు. చెన్నకేశవ కెనాల్‌ను పదర మండలం రాయలగండి తండా వరకు సుమారు 20.5 కి.మీ. మేర నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పదరలో డెలివరీ సిస్టర్న్ ఏర్పాటు చేసి, ఈ కెనాల్‌కు అనుసంధానంగానే పదర కెనాల్, కొండవానిపల్లి కెనాల్ నిర్మాణాలను చేపట్టనున్నారు. ఈ రెండు మినీ కాల్వల ద్వారా పదర మండలంలోని 4,500 ఎకరాలకు సాగునీరందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

చెన్నకేశవ కెనాల్‌కు అనుసంధానంగా రెండు కాల్వల నిర్మాణం:
పదర కెనాల్, కొండవానిపల్లి కెనాల్

పదర కెనాల్:	కొండవానిపల్లి కెనాల్:	ప్రతిపాదిత ఖర్చు
13.6 కి.మీ, 3,986 ఎకరాల ఆయకట్టు	5.2 కి.మీ, 854 ఎకరాల ఆయకట్టు	రూ. 687.50 కోట్లు

రెండో దశ ఎత్తిపోతల పనుల ప్రతిపాదల వివరాలు

మద్దిమడుగు అంజనేయస్వామి రిజర్వాయర్ (మన్ననూర్ వద్ద)	చెన్నకేశవ కెనాల్:	లక్ష్మాపూర్ కెనాల్:
0.509 టీఎంసీల సామర్థ్యం	20.500 కి.మీ. పొడవు, 4,560 ఎకరాల ఆయకట్టు	15.150 కి.మీ. పొడవు, 5 వేల ఎకరాల ఆయకట్టు

ప్రతిపాదనలు పంపించాం..

అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో స్టేజ్–1 కింద లిఫ్ట్ పనులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా స్టేజ్–2 కింద చేపట్టబోయే లిఫ్ట్, రిజర్వాయర్ పనుల కోసం ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి పంపించాం. వాటికి ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు కాగానే ప్రక్రియ మొదలవుతుంది.

– రవీందర్, ఈఈ, నీటిపారుదల శాఖ

క్లుప్తంగా

వడదెబ్బతో రైతు మృతి


చిన్న నర్సింహులు (ఫైల్)

జడ్చర్ల: వడదెబ్బతో రైతు తీవ్ర అస్వస్థతకు గురై శుక్రవారం మృత్యువాత పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాతబజార్‌కు చెందిన రైతు గాలి గూడెం చిన్న నర్సింహులు(60) రెండు రోజుల కిందట వ్యవసాయ పొలం వద్ద వరి కోత పనులు చేపడుతుండగా తీవ్రమైన ఎండవేడిమిని తట్టుకోలేక అస్వస్థతకు గురయ్యాడు. ఒక్కసారిగా వాంతులు, విరేచనాలు కావడంతో వెంటనే బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అంబులెన్స్‌లో గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.

బైక్‌లు ఢీకొని ఒకరు..

పాన్‌గల్: రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపూర్‌తండాకు చెందిన హన్మంతునాయక్(50) ద్విచక్ర వాహనంపై వనపర్తి నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా గోప్లాపూర్ స్టేజీ సమీపంలో మలుపు వద్ద మండలంలోని బహుదూర్‌గూడెం చెందిన వెంకటేష్ గ్రామం నుంచి వనపర్తి వెళ్తూ ఎదురుగా వచ్చే హన్మంతునాయక్ వాహన్ని ఢీకొట్టాడు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిగా తరలించగా తీవ్రంగా గాయపడిన హన్మంతునాయక్ మృతి చెందగా, వెంకటేష్ కాలు దెబ్బతిన్నటుల పోలీసులు తెలిపారు. మృతునికి ముగ్గురు కుమారులు, భార్య ఉన్నారు. మృతుని కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ సమీపంలో కృష్ణానది బ్రిడ్జి కింద బోయ రాములు (52) పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా ధరూర్ మండలం వామనపల్లికి చెందిన బోయ రాములు కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ, మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు మద్యం మానేస్తే ఆరోగ్యం బాగుపడుతుందని హెచ్చరించారు. వారితో గొడవ పడి గద్వాల ఆస్పత్రికి వెళ్తానని చెప్పి ఎర్రవల్లిలో మద్యం, పురుగుల మందు కొనుగోలు చేసి రంగాపూర్ కృష్ణానది బ్రిడ్జి కింద మద్యం, పురుగుల మందు కలిపి తాగి అక్కడిక్కడే మృతి చెందాడు. బాటసారులు చూసి వాట్సాప్ గ్రూప్‌లలో పంపడంతో కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని తమ్ముడు గోవింద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..


నరేష్ (ఫైల్)

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన బూరుగు నరేష్(30) గురువారం రాత్రి రంగారెడ్డి జిల్లా కందుకూరులో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేష్ హైదరాబాదులో ఉంటూ కారు డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. గురువారం మండల కేంద్రానికి వచ్చిన తిరిగి సాయంత్రం హైదరాబాద్ వెళ్తున్నట్లు ఇంటి వద్ద చెప్పాడు. మార్గమధ్యలో కందుకూరులో ఉన్న సోదరుడు రాజేష్ ఇంటికి వెళ్లాడు. గురువారం రాత్రి ఉరేసుకున్నాడు. శుక్రవారం గమనించిన వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతిగల కారణాలు తెలియరాలేదు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బావిలో పడి వివాహిత మృతి

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలోని బావిలో గురువారం మధ్యాహ్నం వెలగొండకు చెందిన జయశ్రీ(30) బావిలో పడి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. చిన్నంబావి మండలం వెలగొండకు చెందిన ప్రకాష్‌రెడ్డి, జయశ్రీ దంపతులు వీపనగండ్ల శివారులో ఉన్న పొలం వద్దకు పనుల నిమిత్తం వచ్చారు. మధ్యాహ్నం భార్యను తాగేందుకు నీరు తీసుకురమ్మని చెప్పగా 5లీటర్ల క్యాన్‌తో వెళ్లి, ఆమె కాలు జారి బావిలో పడింది. సాయంత్ర 4:30 గంటల వరకు తిరిగి రాకపోవడంతో భర్త బావి దగ్గరకు వెళ్లి వాటర్ క్యాన్ నీటిపై తేలాడుతూ కనిపించింది. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయగా బావి నుంచి నీటిని పూర్తిగా తొడివేసి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుడిసె దగ్ధం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. లత్తిపురం చెందిన పెద్ద రంగన్న కుటుంబసభ్యులు కలిసి శుక్రవారం ఉదయం కూలీ పనుల నిమిత్తం గుడిసెకు తాళం వేసి వెళ్లారు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గుడిసె మంటల్లో కాలిపోయింది. స్థానికులు మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. వస్తువులు, బియ్యం, దుస్తులు కాలిపోయాయి. రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

'ఎన్‌ఎంఎంఎస్'లో ప్రతిభ

- ఉమ్మడి జిల్లాలో 277 మంది విద్యార్థుల ఎంపిక
- నెలకు వెయ్యి చొప్పున ఇంటర్ పూర్తయ్యే వరకు ఏడాదికి రూ.12 వేల ఉపకార వేతనం
- స్కాలర్‌షిప్ సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తున్న అత్యధిక స్కాలర్‌షిప్ ఇదే..


విద్యార్థులకు మిఠాయి తినిపిస్తున్న షాసాబ్‌గుట్ట పాఠశాల ఉపాధ్యాయులు, హెచ్‌ఎం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబర్చారు. ఇందుకు సంబంధించి పరీక్ష గతేడాది డిసెంబర్‌లో జరగగా.. ఫలితాలు గురువారం వెలువడ్డాయి. ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో 6 ప్రభుత్వ పాఠశాలల్లో సంబంధించి విద్యార్థులు ఒక్కో పాఠశాల నుంచి 7–8 మంది ఎంపికవడం విశేషం. విద్యార్థులు ర్యాంకులు సాధించేందుకు, స్కాలర్‌షిప్ వచ్చేందుకు పలు పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

వేల సంఖ్యలో హాజరు..

జాతీయ స్థాయిలో విద్యార్థులకు నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు వస్తుంటాయి. ఉమ్మడి జిల్లా నుంచి వేల సంఖ్యలో విద్యార్థులు పరీక్షకు హాజరైనా 277 మంది మాత్రమే అర్హత సాధించారు. అయితే కొందరు ఉపాధ్యాయులు స్కాలర్‌షిప్ సాధించేలా ప్రత్యేకంగా చొరవ చూపుతున్నారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి పరీక్ష జరిగే వరకు విద్యార్థులకు తరగతి సిలబస్‌తోపాటు ఎన్‌ఎంఎంఎస్‌కు సంబంధించి తరగతులు సైతం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని మోడల్ స్కూల్స్, హైస్కూల్స్ కలిపి 550 వరకు ఉంటాయి. వీటిలో చాలా తక్కువ పాఠశాలల విద్యార్థులు మాత్రమే హాజరవుతుండడం విశేషం. అయినప్పటికీ ఉపాధ్యాయులు పరీక్షపై శ్రద్ధ చూపడంతో ఒక్కో పాఠశాల నుంచి 7– 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మరికొన్ని పాఠశాలల్లో అసలు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

▪ ఇందులో నారాయణపేట జిల్లాలోని మద్దూరు జెడ్పీహెచ్‌ఎస్ నుంచి 10 మంది, మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని షాసాబ్‌గుట్ట, గండేడ్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌ల నుంచి 8 మంది చొప్పున, నాగర్‌కర్నూల్ జిల్లాలోని గొరెడ్డిపల్లి పాఠశాల నుంచి 8 మంది, వనపర్తి జిల్లాలోని టీఎస్‌ఎంఎస్ (పెబ్బేరు) నుంచి 8 మంది, జోగుళాంబ గద్వాల జిల్లాలోని చింతలకుంట జెడ్పీహెచ్‌ఎస్ నుంచి 8 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం ఎంపికయ్యారు.

ఆర్థికంగా ప్రయోజనం..

విద్యార్థులు చాలామంది ఆర్థిక ఇబ్బందులతో పాఠశాలలకు రాకపోవడం ప్రధాన సమస్య. అందుకోసం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ ద్వారా ప్రభుత్వం ఇస్తున్న అత్యధిక స్కాలర్‌షిప్ ఇదే కావడంతో ప్రతిఏటా ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుంటారు. ఇందులో ఎంపికైన వారికి నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేలు చెల్లిస్తుంది. దీంతో విద్యార్థులు చదువుకునే ఖర్చుల కోసం తల్లిదండ్రులపై ఆధారపడకుండా, వారికి భారం కాకుండా సులువుగా చదువుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. అయితే ఇంటర్మీడియట్‌కు వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ అందజేస్తుంది. అయితే ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌కు ఈ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ అదనంగా ఇంటర్ వరకు ఇస్తారు. దీంతో విద్యార్థులకు నాలుగేళ్లపాటు ప్రయోజనం కలగనుంది.

ఉమ్మడిజిల్లాలో ఎంపికైన విద్యార్థుల వివరాలు

జిల్లా	ఎంపికైన విద్యార్థులు
మహబూబ్‌నగర్	73
నాగర్‌కర్నూల్	64
జోగుళాంబ గద్వాల	50
నారాయణపేట	47
వనపర్తి	43

ఉపాధ్యాయులు సహకరించారు



ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకునే నాటి నుంచి పరీక్ష రాసే వరకు ఇందుకు సంబంధించి ఉపాధ్యాయులు ఎంతో సహకరించారు. అందువల్ల పరీక్షలో సులువుగా ఉత్తీర్ణత సాధించాం. ఈ స్కాలర్‌షిప్ ద్వారా మాకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ఈ స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా చదువుకుంటాం.

– సాయి వెన్నెల, షాసాబ్‌గుట్ట పాఠశాల, మహబూబ్‌నగర్

పేద విద్యార్థులకు ప్రయోజనం..



ప్రతిభ ఆధారంగా ఇచ్చే ఈ స్కాలర్‌షిప్‌తో ద్వారా మాకు ఎంతో ప్రయోజనం కలగనుంది. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు డబ్బుల కోసం మా అమ్మానాన్నలపై ఆధారపడే అవసరం లేకుండా ఈ స్కాలర్‌షిప్ డబ్బులు ఎంతో ఉపపకరిస్తాయి. పరీక్ష రాసేందుకు మా పాఠశాల ఉపాధ్యాయులు ఎంతో సహకరించారు.

– లక్ష్మణ్, షాసాబ్‌గుట్ట పాఠశాల

పాఠశాలలో ప్రత్యేక శిక్షణ..



విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌లో ఉత్తీర్ణత సాధించేందుకు పాఠశాలలో ప్రతిరోజు సాధారణ తరగతులతోపాటు సాయంత్రం ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. దీంతో పాఠశాల విద్యార్థులు ఏకంగా 8 మంది ఎంపికయ్యారు. గతేడాది కూడా 8 మందికి స్కాలర్‌షిప్ వచ్చింది. ఇందులో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉంది.

– ఫసియొద్దీన్, గణిత ఉపాధ్యాయుడు, షాసాబ్‌గుట్ట, మహబూబ్‌నగర్

111 జీఓ ఎత్తివేతపై ఉద్యమం


రుక్కంపల్లిలో భట్టి విక్రమార్కను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- పీసీసీ మాజీ అధ్యక్షుడు వీహెచ్

నవాబుపేట: రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన 111 జీఓపై కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేపడుతుందని కాంగ్రెస్ నేత వి.హనుమంతురావు అన్నారు. సీఎం కేసీఆర్ రూ.కోట్లు కొల్లగొట్టేందుకు ఈ జీఓను ఎత్తివేశారని ఆరోపించారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను శుక్రవారం నవాబుపేట మండలంలో వీహెచ్‌తోపాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ రాములునాయక్‌తో కలిసి పరామర్శించారు. దీనిని పూర్తిగా వ్యతిరేకించాల్సిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారో.. పార్టీ తరఫున ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 111 జీఓ ఎత్తివేతపై పార్టీలో విస్తృతంగా చర్చించి ముందుకు వెళ్తామన్నారు. మాజీ ఎంపీ రాములునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం లాక్కున్న భూముల్లో రైతులు నాగళ్లు కట్టి దున్నాలని, వారి వెంట కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములు లాక్కుంటే తిరగబడాలని చెప్పారు. త్వరలోనే నియంత పాలనకు ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మంత్రి వర్గ సమావేశంలో నియంత చెప్పినట్లు వినాలని, అంతా అయిపోయిందని చెప్పగానే చప్పట్లు కొట్టాలని అదే కేసీఆర్ కేబినెట్ అని విమర్శించారు. మల్లురవి, అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ఇబ్బందులు పెడుతున్న కేసీఆర్‌పై ప్రజా ఉద్యమం చేస్తామని దీనికి ఆయన తలవంచి వచ్చే ఎన్నికల్లో దిగిపోవడం ఖాయమన్నారు. కేసీఆర్ రజాకార్లను తలపించేలా పోలీసులతో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. మరో ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

భట్టికి పరామర్శ..

పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తూ అస్వస్థతకు గురైన భట్టి విక్రమార్క వైద్యుల సూచన మేరకు మండలంలోని రుక్కంపల్లిలో రెండు రోజులుగా బస చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం శుక్రవారం పెద్దఎత్తున అక్కడికి చేరుకుని పరామర్శించారు. భట్టి భార్య నందిని, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంత్‌రావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ రాములునాయక్, మాజీ ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, ఎర్రశేఖర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, వరంగల్ స్వర్ణమ్మ, ఒబేదుల్లా కొత్వాల్, బంగ్ల రవి, రామచందర్, మీనాక్షి, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటేష్, అమరేష్, నీల్యా తదితరులున్నారు. శుక్రవారం మరోసారి వైద్యులు భట్టిని పరీక్షించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పినట్లు యాత్ర ఇన్‌చార్జ్ దుశ్యంత్‌రెడ్డి తెలిపారు.

మహిళ దారుణ హత్య

నవాబుపేట: మండలంలోని బీబీనగర్ శివారులో మహిళ దారుణ హత్యకు గురైంది. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దరేవల్లికి చెందిన మంజుల(38)కు మల్లెపల్లికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారి మధ్య కుటుంబ తగాదాలు రావటంతో మంజుల మూడేళ్లుగా ఆమె తల్లిగారి గ్రామమైన పెద్దరేవల్లిలో ఉంటుంది. శుక్రవారం అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బీబీనగర్ సమీపంలోని వాగు చెంత మహిళను బండరాయితో మోది హత్య చేశారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూరల్ సీఐ జములప్ప, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాల నేరస్తుడికి జరిమానా

జడ్చర్ల: యువకుడి మృతికి బాలుడు కారణమైన కేసులో జిల్లా న్యాయమూర్తి రూ.6వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించినట్లు సీఐ రమేష్‌బాబు, కోర్టు కానిస్టేబుల్ యాసిన్ తెలిపారు. 2022 ఆగస్టు 2న బాదేపల్లి కూరగాయల మార్కెట్ ప్రాంతానికి చెందిన సుఫియాన్(19) తన బైక్‌పై పట్టణం నుంచి మహబూబ్‌నగర్ బయలుదేరాడు. శంకరాయపల్లి తండాకి చెందిన బాలుడు (17) బైక్‌పై రోడ్డు డివైడర్ దాటే క్రమంలో సుఫియాన్‌ను వేగంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన సుఫియాన్ కోమాలోకి వెళ్లి మృతి చెందాడు. నిబంధనలకు విరుద్ధంగా బాలుడు బైక్ నడుపుతూ యువకుడి మృతికి కారణమయ్యాడని పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి రూ.6వేలు జరిమాన లేదా 6 మాసాల పాటు హైదరాబాద్ బాలల సంరక్షణ కేంద్రంలో ఉండాలని తీర్పును వెలువరించారు.

భయపెడితే.. కంపెనీ ఆపేసి తీరుతాం


ఇథనాల్ కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మరికల్: ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా మాట్లాడినా, పోరాటలు చేసే వారిని భయపెడితే కంపెనీ ఎత్తేసే వరకు తమ పోరాటం ఆగదని కేవీపీఎస్ కన్వీనర్ లక్ష్మయ్య, జిల్లా కన్వీనర్ వెంకట్రాములు అన్నారు. ఇథనాల్ కంపెనీ వద్ద శుక్రవారం చిత్తనూర్, ఎక్లాస్‌పూర్ ప్రజలు కంపెనీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా నిర్మితమవుతున్న ఇథనాల్ కంపెనీ రద్దు కోసం ఏడాదికి పైగా ఉద్యమిస్తున్నామని, నిజాలు రాసే జర్నలిస్టులపై కంపెనీ యాజమాన్యం బెదిరింపులకు దిగడం ఖండిస్తున్నామన్నారు. పచ్చని పంటల మధ్య, గ్రామాల అనుమతి లేకుండా అధికార బలంతో ప్రజలను ధిక్కరిస్తూ కంపెనీ నిర్మాణ పనులు చేస్తున్నారని ఆగ్రహించారు. కార్యక్రమంలో కృష్ణా, మహాదేవ్, నారాయణ, మురళీకృష్ణ, సుదర్శన్, మురళీ, మణివర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరమ్మ, మల్లేష్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్, సిబ్బందిపై దాడికియత్నం

- ఆందోళన చేసిన కార్మికులు
- నిందితులపై కేసు నమోదు


అంబేద్కర్‌చౌరస్తాలో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

జడ్చర్ల: పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేందుకు శుక్రవారం వెళ్లిన మున్సిపల్ కమిషనర్, సిబ్బందిపై స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో మున్సిపల్ కార్మికులు సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేద్కర్‌చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. కమిషనర్ మహ్మద్ షేక్ తెలిపిన వివరాల ప్రకారం.. కమిషనర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ నగేశ్, శివ, వార్డు ఆఫీసర్ జ్ఞానేశ్వర్‌లతో కలిసి 19వ వార్డులో గల నిమ్మబాయిగడ్డ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేందుకు వెళ్లారు. ఈ సమయంలో బీఆర్‌ఎస్ నాయకుడు మసియొద్దీన్, కుమారుడు అమీర్ వచ్చి ఇక్కడేం చేస్తున్నారు? మా ఇంటి దగ్గర ఇంకెప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతారంటూ ఆగ్రహించారు. దాడి చేసేందుకు ప్రయత్నించడంతో పాటు తిట్ల దండకం అందుకున్నారు. చంపుతామంటూ బెదిరించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘం ఆధ్వర్యంలో దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు ఆందోళన చేపట్టారు. ఎస్‌ఐలు లెనిన్, ఖాదర్ వారికి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

'కురుమూర్తి'లో భక్తుల పూజలు


కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి స్వామి దర్శనానికి అమావాస్యను పురస్కరించుకుని గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి క్యూలైన్‌లో నిల్చున్నారు. మెట్లపై దీపాలు వెలిగిస్తు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం, స్వామి వారి పాదాల వద్ద భక్తులు దర్శించుకున్నారు.


మెట్ల వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ఎగువ నుంచి 2,264 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులో 6.914 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 146 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 809.6 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 809.6 అడుగుల నీటిమట్టం, 34.1 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24గంటల సమయంలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు నీటి విడుదల కాలేదు. ఎండ తీవ్రత వలన జలాశయంలో 224 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడులో..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాలువ నీటిని నిలిపారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

అగ్రహారం పొట్లపల్లిని సందర్శించిన శాస్త్రవేత్తలు


అగ్రహారం పొట్లపల్లిలో రైతులతో యువశాస్త్రవేత్తలు

రాజాపూర్: మండలంలోని అగ్రహారం పొట్లపల్లిని శుక్రవారం క్షేత్ర అనుభవ శిక్షణలో భాగంగా 28 రాష్ట్రాలకు చెందిన 117 మంది యువ శాస్త్రవేత్తలు జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వ్యవసాయరంగంలో ఏ విధంగా మెరుగు పరచాలనే అవగాహన కోసం ఈ క్షేత్ర ప్రదర్శన ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. మహిళా రైతులు సాగులో తీసుకోవాల్సిన సూచనల గురించి యువశాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ప్రధాన శాస్త్రవేత్తలు జయరాఘవేందర్‌రావ్, రామాంజనేయులు, బ్రజేందర్, సంధ్యషేనాయ్, దండపాణి, సెందిల్, మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్, మండల విస్తరణ అధికారి దీపికాగౌడ్‌తో పాటు యువ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

జోగుళాంబలో వైభవంగా చండీహోమాలు

- అమావాస్య కావడంతో భారీగా వచ్చిన భక్తులు


గుమ్మడికాయ దీపాలు వెలిగిస్తున్న భక్తుడు


త్రిశతి, ఖడ్గమాల అర్చనలు చేస్తున్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు అమావాస్య శుక్రవారం కలిసి రావడంతో భక్తుల రద్దీతో కిక్కిరిశాయి. ఈ సందర్భంగా దేవస్థానం వారు జోగుళాంబ అమ్మవారి ఆలయంలోని యాగశాలలో సామూహిక చండీహోమాలు నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి 223 మంది హోమాలలో పాల్గొన్నారు. కేవలం 50 మందికి మాత్రమే సరిపడ స్థలంలో పెద్దమొత్తంలో రావడం, పైగా ఎండలు అధికంగా ఉండటం, దీంతో భక్తులంతా యాగశాల బయట నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో విషయం తెలుసుకున్న ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ భక్తులతో మాట్లాడి యాగశాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేయించారు. ఆలయ అర్చకుడు వేముల విక్రాంత్ శర్మ చండీహోమాలను శాస్త్రీయంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2గంటలకు పూర్ణాహుతితో ముగిశాయి. బాలబ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భోజన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా చండీహోమాలతో దేవస్థానంకు రూ.2.23 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

త్రిశతి, ఖడ్గమాల అర్చనలు

అమ్మవారి మండపంలో త్రిశతి, ఖడ్గమాల అర్చనలను భక్తులు చేయించారు. దీంతో గర్భాయలం మండపం భక్తులతో కిక్కిరిసింది. మధ్యాహ్నం 4 గంటల వరకు అర్చనలు చేశారు. కుంకుమార్చన మండపంలో భక్తులు రూ.50వేల టికెట్లు కొనుగోలు చేసి కుంకుమార్చనలు చేయించారు. అమావాస్య కావడంతో భక్తులు జోగుళాంబ ఆలయం వద్ద గుమ్మడికాయలతో దీపాలు వెలిగించారు. నరదృష్టిని నివారించే తల్లి జోగుళాంబ అమ్మవారు అని ఇలా గుమ్మడి కాయలతో దీపాలు వెలిగించడం వల్ల నరదృష్టి దోషాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.